క్లుప్తంగా

మదరసా నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి

తాడిపత్రి: రూరల్ పరిధిలోని రమేష్‌రెడ్డి కాలనీలో నూతన మదరసా నిర్మాణానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. కాలనీలోని ముస్లింల కోరిక మేరకు ఆయన కార్యక్రమానికి హాజరై ప్రార్థనల్లో పాల్గొన్నారు.

'శిక్షణ తరగతులకు తరలిరండి'



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

గుంతకల్లు: ఈనెల 26, 27, 28 తేదీల్లో కడప నగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య చేతులు మీదుగా కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రోహిత్, శివమణి, సమీర్, షేక్షావలి, రాజు, జయరాం, హరి, మనోహర్ తేజ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



హోమం చేస్తున్న అర్చకులు

గుత్తి: మండల పరిధిలోని కొత్తపేట సమీపంలో దాతల విరాళాలు రూ.1.45 కోట్లతో నూతనంగా నిర్మించిన నవ అహోబిలం నరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాత ఓబులరెడ్డి స్వామి, అహోబిలం లక్ష్మి నరసింహ స్వామి ఆలయం ప్రధాన అర్చకుడు రమేష్ స్వామి ఆధ్వర్యంలో హోమాలు జరిగాయి. లక్ష్మీ నరసింహస్వామి మూల విరాట్‌ను వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్టించారు.

టెంపుల్ స్కూల్ విలీనం నిర్ణయం సరికాదు

గుంతకల్లు రూరల్: కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను (టెంపుల్ స్కూల్) వేరే స్కూల్‌లో విలీనం చేయడం సరికాదు. మరో చోటుకి మార్చడం వంటి నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాదిగ దండోరా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంఈఓ మస్తాన్‌రావుకు విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు.

బైక్‌ను ఢీకొన్న ఐచర్

గుత్తి: మండల పరిధిలోని రజాపురం సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని ఐచర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సాయి పవన్, రాజు తీవ్రంగా గాయపడ్డారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన సాయి పవన్, రాజు బైక్‌లో గుంతకల్లుకు బయలు దేరారు. అయితే మార్గ మధ్యంలో ఐచర్ వాహనం బైక్‌ను ఢీకొట్టింది. చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

దశభుజ అలంకరణలో రామచంద్రస్వామి



తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డపాలెంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం దశభుజ అలంకరణలో రామచంద్ర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఏఐకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

గార్లదిన్నె: మర్తాడులో శుక్రవారం అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి ఏపీ రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. జిల్లా కమిటీ సభ్యులు చెన్నారెడ్డి, నారాయణ రెడ్డి, నాగార్జున, వలి, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా బ్యాంకులో వడ్డీ మాత్రమే కట్టించుకొని పంట రుణాలు రెన్యూవల్ చేయాలని మర్తాడు కెనరా బ్యాంకు వద్ద రైతులు ఆందోళన చేశారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో శుక్రవారం అఖిలభారత కిసాన్ సభ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం నేతలు జెండా ఆవిష్కరించారు.

మామిడి రంగుతో మాయ

పండ్లలో రారాజుగా పేరున్న మామిడి పండ్ల సీజన్ ప్రారంభమైంది. అయితే కొందరు స్వార్థపరులు డబ్బు సంపాదనే ధ్యేయంగా మామిడి పండ్లను రసాయనాలు ఉపయోగించి మాగబెడుతూ మంచి రంగు వచ్చేలా చేస్తూ అమ్మకాలు సాగిస్తున్నారు. ఇలా మాగబెట్టిన పండ్లను తినడం వల్ల ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఇదే అదునుగా వ్యాపారులు తమ పనిని సులువుగా కానిచ్చేస్తున్నారు.



రసాయనాలు ఉపయోగించి మాగబెట్టిన మామిడి పండ్లు

- రసాయనాలతో మాగబెడుతున్న వ్యాపారులు
- రంగు చూసి మోసపోతున్న ప్రజలు
- తింటే అనారోగ్యం తప్పదంటున్న వైద్యులు
- పట్టించుకోని అధికారులు



నిరుపయోగంగా ఉన్న ఫ్రూట్ కాంప్లెక్స్



కాల్షియం కార్బైడ్

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో మామిడి తోటలను వ్యాపారులు లీజుకు తీసుకున్నారు. తాడిపత్రి మండలంలో 822 ఎకరాలు సాగులో ఉండగా ఎక్కువగా ఆలూరు, వెలమకూరు, బోడాయిపల్లి, చుక్కలూరు, గంగాదేవిపల్లి, యుగదూరు, వీరాపురం గ్రామాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. పెద్దపప్పూరు మండలంలో 252 ఎకరాల్లో ఉండగా గార్లదిన్నె, పసలూరు, కుమ్మెత, జూటూరు గ్రామాల్లో సాగు చేస్తున్నారు. యాడికి మండల కేంద్ర పరిధిలోని గ్రామాల్లో 119 ఎకరాల్లోను, యల్లనూరు మండలంలో 80 ఎకరాల్లో ఉండగా యల్లనూరు, వెన్నపూసపల్లి, పెద్దమల్లేపల్లి, నిట్టూరు గ్రామాల్లో విస్తరించి ఉన్నాయి. తాడిపత్రి ప్రాంతానికి సరిహద్దుగా ఉన్న కడప జిల్లాలోని పెన్నానది పరివాహన ప్రాంతాల్లో విస్తరించిన మామిడి తోటలు ఉన్నాయి.

గతానికి భిన్నంగా...

గతంలో రైతులు స్వయంగా మామిడి కాయలను సాంప్రదాయ పద్ధతుల్లో మాగబెట్టి మార్కెట్లకు తరలిస్తుండేవారు. ప్రస్తుతం ఎక్కువ మంది వ్యాపారులు చెట్లపై ఉన్న కాయలను హోల్‌సెల్‌గా కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నెలలో ఎండల తీవ్రత ఎక్కువ కావడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. దిగుబడి తగ్గడంతో తాడిపత్రి మార్కెట్‌తో పాటు ఇతర మార్కెట్లకు మామిడి పండ్ల రవాణా తగ్గింది. తగ్గిన దిగుబడిని క్యాష్ చేసుకునేందుకు పక్వానికి రాని కాయలను సైతం చెట్లపై నుంచి పీకి రసాయనాలతో కృత్రిమంగా మాగబెడుతూ మార్కెట్లకు తరలిస్తున్నారు. ఇలాంటి రోజూ తాడిపత్రి పట్టణానికి తరలిస్తూ గంప, చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వ్యాపారులకు బాక్సుల పేరుతో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

అనారోగ్యంపై తీవ్ర ప్రభావం

మామిడి కాయలను వ్యాపారులు ఎక్కువగా కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగించి మాగబెడుతున్నారు. చౌకగా , సులభంగా లభించే పదార్థం కావడంతో వ్యాపారులు అధికంగా ఉపయోగిస్తున్నారు. ఇలా మాగబెట్టిన మామిడి పండ్లు తింటే ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. తల తిరగడం, తరుచుగా దాహం వేయడం, చికాకు కలగడం, వాంతులు, విరేచనాలు, చర్మ సమస్యలు, కాన్సర్ కారక లక్షణాలు కనిపిస్తామని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

తాడిపత్రి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో మునిసిపల్ అధికారులు మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీలో కాయలను నిల్వ చేసుకోవడంతో పాటు ఇథలిన్ గ్యాస్‌తో కాయలను మాగబెట్టుకునే ఏర్పాట్లు చేశారు. గంప, తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల కోసం మార్కెట్ యార్డులో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేశారు. అప్పట్లో కాల్షియం కార్బైడ్‌తో మాగబెట్టిన మామిడి పండ్లను వాహనాల ద్వారా తొక్కించారు. దీంతో వ్యాపారులు భయపడి ఇథలిన్ గ్యాస్ ద్వారా కాయలను మాగబెట్టేవారు. ఈ పద్ధతి కేవలం రెండు సంవత్సరాలు కూడా కొనసాగలేదు. మునిసిపాలిటీ అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇథలిన్ గ్యాస్‌తో పండ్లను మాగబెట్టడం ఖర్చుతో కూడుకున్నదన్న నేపంతో వ్యాపారులు తిరిగి కాల్షియం కార్బైడ్ ఉపయోగిస్తున్నారు. ఈ విషయం తెలిసినా ప్రస్తుతం మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఫ్రూట్స్ మార్కెట్ కూడా అటకెక్కింది. ప్రస్తుతం ఫ్రూట్స్ మార్కెట్ కోసం ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ నిరుపయోగంగా మారింది.

రసాయనాలతో మాగబెడితే చర్యలు



ఆరోగ్యకరమైన పద్ధతుల ద్వారా కాకుండా రసాయనాలతో మామిడి కాయలను మాగబెట్టి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుంటాం. తోటల్లో కాయలను మాటబెట్టి మార్కెట్‌కు వ్యాపారులు తరలిస్తున్నారని తెలిసింది. వారిపై చర్యలు తీసుకుంటాం. ఇలాంటి పండ్లను చిరువ్యాపారులు తీసుకోవద్దు.

– వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

అలాంటి పండ్లు తినకండి



సాంప్రదాయ రీతిలో మాగబెట్టిన మామిడి కాయలను మాత్రమే తినాలి. రసాయనాలతో కృత్రిమంగా మాగబెట్టిన కాయలను తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. ఎక్కువగా వాంతుల, విరేచనాలు, చికాకు, చర్మ సమస్యలు కనిపిస్తాయి. ప్రాణాంతకంగా కూడా మారవచ్చు.

– డెవిడ్, సూపరింటెండెంట్, తాడిపత్రి ఏరియా ఆస్పత్రి

జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



గుత్తి: నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



బీకేఎస్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ భాస్కర్, తదితరులు



తాడిపత్రి: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లో శుక్రవారం పూలే జయంతిని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి, మాజీ కన్వీనర్ పీరా, మండల కన్వీనర్ గంగరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. అలాగే బీజేపీ, జేవీవీ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు.

పామిడి: పట్టణంలో బీఎస్పీ, భారతీయ భీమ్ సేన, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఆధర్వంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అయా సంఘాల నాయకులు, కొట్టాల సూర్యనారాయణ, మల్లేష్, శివ, మూర్తి, చిన్నదుర్గప్ప, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: సమసమాజ స్థాపనకు అహర్నిశలు కృషి చేసి, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను కొనసాగిద్దామని ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరూ మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత, జెడ్పీటీసీ భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాలులు అర్పించారు. అలాగే పెద్దమ్మ గుడి వద్ద ఉన్న సచివాలయంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, జ్యోతిరావు పూలేకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ సాల్‌మాన్, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ నాయకులు సాకే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద స్కూల్‌లో ఉద్యోగ ఉపాధ్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జ్యోతిరామ్‌పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు గురప్ప, కార్యదర్శి రామాంజినేయులు, కన్వీనర్ నారబోయిన శంకర్, కో కన్వీనర్ కరుణాకర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని కురగాయల మార్కెట్ వద్ద పూలే విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎస్‌పీ అధ్యక్షుడు విశ్వనాథ్, ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ కో-కన్వీనర్ పుల్లయ్య, పట్టణాధ్యక్షుడు రాజారత్నం, ప్రధాన కార్యదర్శి శివుడు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

తాడిపత్రిరూరల్: వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ముస్లింలు శుక్రవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రార్థనల అనంతరం సిద్ది బాషా దర్గా వద్ద రిలే నిరాహార దీక్షల ప్రాంగణం నుంచి ర్యాలీగా సీబీరోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ర్యాలీలో వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రజాక్ వలికి వినతిపత్రం అందచేశారు. ర్యాలీలో ముస్లిం పెద్దలు హయాజ్‌బాషా, అరిఫ్, అన్వర్, నాయకులు ఫయాజ్‌బాషా, మహబూబ్‌బాషా, అబ్దుల్లా, జిలాన్, సలాం, వలి, అయూబ్ పాల్గొన్నారు.

పామిడి: కేంద్ర ప్రభుత్వం వెంటనే వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేయాలని ముస్లిం, మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఖిల్లా కోటా మసీదు నుంచి ఈద్గా మసీదు వరకూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. ముస్లిం, మైనార్టీ నాయకులు ముఫ్తి అబ్దుల్ సలామ్, ముఫ్తి హిదయతుల్లా, ముఫ్తి రషీద్, ముతువలి బీకే రహీమ్, సీపీఐ నేత కె.రహీమ్ తదితరులు పాల్గొన్నరు.

సంక్షిప్త సమాచారం

పామిడిలో మోస్తరు వర్షం

పామిడి: పామిడిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. బలమైన గాలులు వీయడంతో డాబా ఇళ్ల రేకులు, ప్లాస్టిక్ వస్తువులు ఎగిరిపోయాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఉపశమనం పొందారు.

వడ్డీ కట్టించుకొని రెన్యూవల్ చేయండి

పెద్దవడుగూరు: మండలంలోని రైతులు పంటలు పండక తీవ్ర ఇబ్బందులు పడుతూ క్రాప్‌లోన్లు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారని వడ్డీ మాత్రమే కట్టింకొని రుణాలు రెన్యూవల్ చేయాలని కౌలు రైతు సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి, మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పెద్దవడుగూరు యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.

శిశువుల్లో ఇన్ఫెక్షన్లను తగ్గించండి

తాడిపత్రి రూరల్: పట్టిన శిశువుల్లో ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి తల్లులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీపీఓ సాజిదాబేగం తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసపురం -1, పీర్లమాన్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషణ, పక్వాడ్‌పై ప్రత్యేక కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పల్లవి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణం

గుంతకల్లుటౌన్: శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పురాతన కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ఉదయం 9:30 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మఠం మల్లికార్జున తెలిపారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

గుత్తి: ప్రతి ఒక్కరూ రేషన్ షాపుకు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఓబులేసు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 30వ తేదీలోపు ఈ-కేవైసీ తప్పకుండా చేయించాలన్నారు.

ఐఓసీ డిపో సీనియర్ మేనేజర్‌గా హరీష్

గుంతకల్లు రూరల్: మండలంలోని నక్కనదొడ్డి సమీపంలో ఉన్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ డిపో మేనేజర్‌గా హరీష్ కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఐఓసీ ఇతర అధికారులు, సిబ్బంది హరీష్‌కుమార్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు.

రైలులో నుంచి జారిపడి మహిళ

గుత్తి: గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలోని కర్నూలు రైల్వే గేట్ వద్ద రైలులో నుంచి ప్రమాదవశాత్తూ నాగరత్నమ్మ అనే మహిళ జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాలు.. పీలేరుకు చెందిన నాగరత్నమ్మ కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు బయలు దేరింది. అయితే మార్గమధ్యంలో నిద్రలేచి బాత్ రూమ్‌కు వెళ్లింది. బాత్ రూమ్ డోర్ అనుకుని మెయిన్ డోర్‌లోకి వెళ్లింది. అకస్మాత్తుగా కాలు జారి కిందపడటంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన పాయింట్స్‌మెన్ రామాంజనేయులు ఆమెను చికిత్స నిమిత్తం గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. జీఆర్పీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సామాజిక చైతన్య యాత్ర

పుట్లూరు: కడవకల్లు, చాలవేముల తదితర గ్రామాల్లో శుక్రవారం సామాజిక చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారలేదని, పేదలకు కనీసం మౌలిక వసతులను కల్పించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన తరగతులకు చెందిన వారికి ఇప్పటికీ సొంత ఇళ్లు లేవన్నారు. నాయకులు సూరి, పరమేష్, వెంకటేష్, శ్యామల, చంద్రిక, రామాంజినమ్మ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చెన్నమ్మ తిరునాల



అలంకరణలో చెన్నమ్మ అమ్మవారు



సుడిబండిని లాగిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: మండల పరిధిలోని రావులుడికి గ్రామంలో చెన్నమ్మ తిరునాల శుక్రవారం పొంగుపాలు కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముందు భాగంలో పచ్చి కుండలో పాలు పోసి పచ్చికట్టెలతో మంట మండించి పాల పొంగు కార్యక్రమం నిర్వహించారు. పాలు ఏదిక్కుకు పొర్లితే ఆ వైపు నుంచి వర్షాలు వస్తాయని భక్తుల నమ్మకం. ఈ సంవత్సరం పాల పొంగు నాలుగు దిక్కులకు సమానంగా వచ్చాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం గంగమ్మ పెట్టెను ఊరేగింపుగా తీసుకెళ్లారు. సుడిబండిని ఎద్దులతో లాగించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనాల తనిఖీ చేపడుతున్న సీఐ సత్యబాబు, ఎంవీఐ రాజగోపాల్

పుట్లూరు: నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పుట్లూరు సీఐ సత్యబాబు వాహనదారులను హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండలంలోని కడవకల్లు గ్రామంలో తాడిపత్రి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌తో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో యల్లనూరు ఎస్ఐ రామాంజులరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

గార్లదిన్నె: తలగాచిపల్లి క్రాస్ వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం పోలీసులు, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా వాహనాలు తనిఖీ చేపట్టారు. ఎస్ఐ గౌస్ మహ్మద్ బాషా, ఎంవీఐ శ్రీనివాసులు నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాలు,గూడ్స్ వాహనాల్లో కూలీలను తరలిస్తున్న వాహనాలు, అధిక లోడ్‌తో వెళ్తున్న ఆటోలు, అలాగే పర్మిట్ లేని వాహనాలు, ట్యాక్స్ కట్టని స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. రికార్డులు లేని 12 వాహనాలను సీజ్ చేసి రూ. 90,700 జరిమానా విధించారు.

కిరణ్‌ను కఠినంగా శిక్షించాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి



గుంతకల్లుటౌన్: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సతీమణి భారతిరెడ్డిపై నీచమైన వ్యాఖ్యలు చేసిన ఐ-టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతి రెడ్డి డిమాండ్ చేశారు. అటు మీడియా, ఇటు వ్యాపార రంగంలో రాణించడంతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వైఎస్ భారతిపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఇలాంటి తప్పుడు కూతలు కూసిన వెధవతో పాటు రేటింగ్స్ కోసం ఇలాంటి సైకోలను ఎంటర్‌టైన్ చేస్తూ రాక్షసానందం పొందుతున్న యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు, కెమెరామెన్‌ను కఠినంగా శిక్షించాలని శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

చేబ్రోలు కిరణ్‌పై కేసు నమోదు చేయండి



వన్‌టౌన్ సీఐ మనోహర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు

గుంతకల్లుటౌన్: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ భారతిరెడ్డిపై నీచపు వ్యాఖ్యలు చేసిన ఐ-టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ కోరారు. శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్ సీఐ మనోహర్‌ను ఆ పార్టీ యువజన నాయకులు కలిసి కిరణ్‌పై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఐ-టీడీపీ కార్యకర్తను ఇంటర్వ్యూ చేసిన సదరు యూట్యూబర్, కెమెరా మెన్‌తో పాటు ఈ వీడియోలను వైరల్ చేసిన వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు రామాంజినేయులు, ఫయాజ్, అనిల్, మనోజ్, శివ, రాఫీ, కుళ్లాయప్ప, ప్రశాంత్, శర్మస్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆత్మాసీతారాముల కల్యాణం



ఆత్మాసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శింగనమల: శింగనమలలోని అతి పురాతమైన ఆత్మాసీతారాముల ఆలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం దేవదాయ అధికారులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి తరువాత చతుర్దశి రోజు రాత్రి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. అంతకుముందు గ్రామంలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఎమ్మెల్యే బండార శ్రావణిశ్రీ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.